నేడు డయల్ యువర్ డీఎం

మేడ్చల్: ప్రయాణికుల సమస్యలు తెలుసుకుని సత్వరం పరిష్కరించడానికి నేడు మేడ్చల్ ఆర్టీసీ డిపోలో డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డీఎం సుధాకర్ తెలిపారు. ప్రయాణికులు తమ సమస్యలు, సలహాలు, సూచనలను డీఎంకు తెలియజేయడం వల్ల వెంటనే పరిష్కరించేందుకు వీలుంటుందన్నారు. నేడు సాయంత్రం 3 గంటల నుంచి 4 గంటల వరకు సంప్రదించాల్సిన నంబరు 9959226152.

ఉచిత వైద్య శిబిరం



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

మేడ్చల్: సీఎంఆర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో పట్టణంలోని 16వ వార్డులో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. వైద్య శిబిరానికి హాజరైన వారికి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వైద్య శిబిరాన్ని వార్డు మాజీ కౌన్సిలర్ ఉమానాగరాజు ప్రారంభించారు. పేదల కోసం కార్పొరేట్ ఆసుపత్రులు ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించి రోగులకు మందులు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. శిబిరంలో ఆస్పత్రి ఇన్‌చార్జ్ దుర్గాప్రసాద్‌రెడ్డి, ప్రతినిధులు మహేందర్, రాజశేఖర్‌రెడ్డి, సరోజ, జ్యోతి, వైద్యులు వార్డు వాసులు పాల్గొన్నారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం



సీసీరోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న దృశ్యం

మౌలాలి : డివిజన్ ఎంజేకాలనీలో సీసీరోడ్డు నిర్మాణ పనులను స్థానిక కార్పొరేటర్ సునీతా శేఖర్‌యాదవ్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మౌలాలిని ఆదర్శవంతమైన డివిజన్‌గా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించి అమలు చేస్తామన్నారు. ప్రజా సమస్యలను తన దృష్టికి తీసుకొస్తే సంబంధిత అధికారులతో చర్చించి పరిష్కరించేందుకు డివిజన్ పరిధిలో అంతర్గత రహదారులను మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామన్నారు. కాలనీ ప్రెసిడెంట్ ప్రసాద్ చౌదరీ, లక్ష్మీకుమారి, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

మల్కాజిగిరి: ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్ ప్రశాంత్‌నగర్ కాలనీలో మౌలిక వసతుల కల్పనకు కృషిచేస్తానని ఎమ్మెల్యే రాజశేఖర్‌రెడ్డి అన్నారు. గురువారం మౌలాలి రైల్వే క్వార్టర్స్ నుంచి ప్రశాంత్‌నగర్, శ్రీపురికాలనీ వరకు పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులు రోడ్డులేకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నామని, రైల్వే విభాగం ఆధీనంలో ఉండటంతో సమస్య పరిష్కారం కావడం లేదని ఆయన దృష్టికి తీసుకొచ్చారు. రైల్వే అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. రైల్వే క్వార్టర్స్ నుంచి ఆర్టీసీబస్సు సరీ్వసులు రెగ్యులర్‌గా తిరిగేలా చూస్తామన్నారు. పలువురు బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించాలని వినతి

గౌతంనగర్: డివిజన్ పరిధిలోని అన్ని కాలనీల్లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు తగిన చర్యలు తీసుకోవాలని, తాగునీటి సరఫరాను మెరుగుపర్చాలని కార్పొరేటర్ మేకల సునీతారాముయాదవ్ గురువారం ఖైరతాబాద్‌లో జలమండలి జీఎం అశోక్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. గౌతంనగర్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో డ్రైనేజీ పనులు అస్తవ్యస్తంగా ఉన్నాయని, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీకి నిధులు మంజూరు చేయాలని కోరారు. బీఆర్‌ఎస్ నేతలు మేకల రాముయాదవ్ పాల్గొన్నారు.

మురుగు.. పరుగు !

కుషాయిగూడ: చర్లపల్లి డివిజన్, సుభాష్‌నగర్ కాలనీ ప్రధాన గేటు ఎదురుగా గతవారం రోజులుగా మ్యాన్‌హోల్ నుంచి మురుగు పొంగి పొర్లుతుంది. ఎంఆర్‌ఆర్ స్కూల్ ముందు నుంచి ఈసీఐఎల్–నాగారం ప్రధాన రోడ్డు వెంట మురుగు పారడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. పాదచారులు దుర్వాసతో ఇబ్బంది పడుతున్నారు. దీనిపై జీహెచ్ఎంసీ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం స్థానికులు వాపోతున్నారు. అధికారులు స్పందించి మ్యాన్‌హోల్‌కు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

‘ఆపరేషన్ సిందూర్’ విజయోత్సవ ర్యాలీ

జవహర్‌నగర్: ఆపరేషన్ సిందూర్ పేరుతో ఉగ్ర స్థావరాలపై భారత సైన్యం తుద ముట్టించడం హర్షణీయమని మాజీ మేయర్ మేకల కావ్య అన్నారు. ఆపరేషన్ సిందూర్‌కు మద్దతుగా బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మాజీ మేయర్ కావ్య ఆధ్వర్యంలో గురువారం జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రపంచ మానవాళి ఉగ్రవాదాన్ని సంహించదని, ఉగ్రవాదం అంతం కావాల్సిందేనన్నారు. మాజీ కార్పొరేటర్లు లలితాయాదవ్, సంగీత, బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు కొండల్‌ముదిరాజ్, వర్కింగ్ ప్రెసిడెంట్ సుధాకర్‌చారి, సోషల్ మీడియా కన్వీనర్ అహ్మద్‌పాషా, నాయకులు మహేష్, ఖాసీం, సిద్దులుయాదవ్, వెంకటేష్‌గౌడ్, శోభ, సంధ్య తదితరులున్నారు.



మల్లారెడ్డి కళాశాలలో జాతీయ జెండాలు ప్రదర్శిస్తున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి, విద్యార్థులు



జవహర్‌నగర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న మాజీ మేయర్ కావ్య, బీఆర్‌ఎస్ నేతలు

మల్లారెడ్డి మహిళా కళాశాలలో..

మేడ్చల్: ‘ఆపరేషన్ సిందూర్’ పేరుతో భారత సైన్యం పాకిస్తాన్ ఉగ్రమూకలను తుదముట్టించడంతో మైసమ్మగూడలోని మల్లారెడ్డి మహిళా కళాశాలలో విద్యార్థులు, ఎమ్మెల్యే మల్లారెడ్డి విజయోత్సవ సంబరాలు నిర్వహించుకున్నారు. మైసమ్మగూడలోని మల్లారెడ్డి మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో భారత సైన్యం ప్రధానంగా మహిళా కల్నల్ సోఫియా ఖురేషి, వింగ్ కమాండర్ వ్యోమికాసింగ్‌లు నేతృత్వం వహించి చాకచక్యంగా పాక్‌లోని ఉగ్రవాదులు, ఉగ్రవాద స్థావరాలను నేలమట్టం చేసి, భారతసైన్యం సత్తా చూపారన్నారు. విద్యార్థులు, ఎమ్మెల్యే మల్లారెడ్డి కళాశాలలో జాతీయ జెండాలను చేతబట్టి ఇండియన్ ఆర్మీ ‘హమ్ ఆప్‌కే సాత్ హై’.. అంటూ నినాదాలు చేశారు. కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా సత్యనారాయణస్వామి కల్యాణోత్సవం

కీసర: నాగారం మున్సిపాలిటీ పరిధిలో రమాసహిత సత్యనారాయణస్వామి, సాయిబాబా, అభయాంజనేయస్వామి దేవస్థానంలో వైశాఖ శుద్ధ ఏకాదశిని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ×ఆపరేషన్ సిందూర్×తో దేశం కోసం పోరాడుతున్న భారత సైనికులకు భగవంతుడి కృపాకటాక్షాలు ఉండాలని గురువారం సత్యనారాయణస్వామి కల్యాణం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టారు. మున్సిపల్ మాజీ చైర్మన్ కొకుట్ల చంద్రారెడ్డి, మాజీ కౌన్సిలర్లు, దేవస్థానం కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



కల్యాణోత్సవంలో మున్సిపల్ మాజీ చైర్మన్ చంద్రారెడ్డి

బీజేపీ బలోపేతానికి కృషి చేస్తా



ఎంపీ ఈటల రాజేందర్‌తో తోటనరేష్, బీజేపీ నాయకులు

కీసర: దమ్మాయిగూడ మున్సిపాలిటీ బీజేపీ నూతన అధ్యక్షుడు తోట నరేష్ గురువారం మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. బీజేపీ మాజీ ఉపాధ్యక్షుడు కొంపల్లి మోహన్‌రెడ్డి, మేడ్చల్‌రూరల్ జిల్లా గౌరవ అధ్యక్షులు పట్లోళ్ల విక్రమ్‌రెడ్డి, రూరల్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, ఏనుగు సుదర్శన్‌రెడ్డిలను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో ఇచ్చిన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తిస్తానన్నారు. బీజేపీ నేతలు గాలి సంపత్‌యాదవ్, విక్రమ్‌సింగ్, శేఖర్‌చారి, కృష్ణ, ధర్మేందర్, గోవర్ధన్‌రెడ్డి, పద్మావతి, చక్రపాణి, రఘునాథ్‌సింగ్, లక్ష్మారెడ్డి, శేఖర్‌గౌడ్, డాక్టర్ బాలయ్య, ఆంజనేయులు, ఆనంద్, వెంకటేశ్వర్లు తదితరులున్నారు.

కార్మికుల సమ్మె పోస్టర్ ఆవిష్కరణ



కీసర ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సమ్మె పోస్టర్‌ను విడుదల చేస్తున్న దృశ్యం

కీసర: కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న 4 లేబర్ కోడ్స్‌ను రద్దుచేయాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని తెలంగాణ ఆశావర్కర్స్ యూనియన్, సీఐటీయూ మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా కార్యదర్శి రేవతికల్యాణి అన్నారు. 20న జరిగే దేశవ్యాప్త కార్మిక కర్షక జాతీయ సమ్మెలో భాగంగా గురువారం కీసర ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారికి సమ్మె నోటీస్ అందజేసి పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వ విధానాల వల్ల కార్మికులు, రైతులు, ప్రజలకు నష్టం కలిగిస్తే ఉద్యమించడమే మార్గమన్నారు. 8 గంటల పని దినాన్ని 12 గంటలకు పొడిగించడం, సంఘం పెట్టుకుని సంఘటితంగా పోరాడే రాజ్యాంగహక్కును కాదనడం తదితర అనేక కార్మికవర్గానికి నష్టం కలిగించే 4 కార్మిక కోడ్లను రద్దుచేయాలని డిమాండ్ చేశారు. 20న సమ్మెలో ఆశాకార్యకర్తలందరూ విజయవంతం చేయాలని కోరారు. మంగ, సునీత, రాణి, జయప్రద, యాదమ్మ పాల్గొన్నారు.

నాణ్యతలేని విత్తనాలు తయారు చేస్తే కఠిన చర్యలు

మేడ్చల్ జిల్లా వ్యవసాయాధికారి చంద్రకళ

శామీర్‌పేట్: నాణ్యత లేని విత్తనాలు తయారు చేస్తే కఠిన చర్యలు తప్పవని మేడ్చల్ జిల్లా వ్యవసాయాధికారి చంద్రకళ హెచ్చరించారు. గురువారం తూంకుంట మున్సిపాలిటీ పరిధిలోని దేవర యాంజాల్‌లో విత్తన కంపెనీలను ఆకస్మికంగా ఆమె తనిఖీ చేశారు. డెన్మార్క్ సీడ్స్, సిరిసీడ్స్, యూనివేజ్ మహికో, బ్రహ్మపుత్ర సీడ్స్, కోరమండల్ కంపెనీలను సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయాధికారి చంద్రకళ మాట్లాడుతూ.. ప్రతి కంపెనీలో నాణ్యమైన విత్తనాలు మాత్రమే తయారు చేయాలని, స్టాక్ బోర్డులు, స్టాక్ రిజిష్టర్లు ఏర్పాటు చేయాలన్నారు. నాణ్యత లేని విత్తనాలను తయారు చేస్తే విత్తన చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విత్తన ధ్రువీకరణ ఏడీ శివకుమార్, మండల వ్యవసాయాధికారి రమేష్, ఎస్‌ఓటీ ఎస్సై రోహిత్ పాల్గొన్నారు.

మేడ్చల్ ఏసీపీ బదిలీ

మేడ్చల్: మేడ్చల్ ఏసీపీ శ్రీనివాసరెడ్డి డీజీపీ కార్యాలయానికి బదిలీపై వెళ్లారు. సిద్దిపేట్ సీసీఆర్బీలో పనిచేస్తున్న సీహెచ్. శంకర్‌రెడ్డి మేడ్చల్ ఏసీపీగా బాధ్యతలు స్వీకరించనున్నారు.

అన్నపూర్ణదేవి కల్యాణమహోత్సవం



రామంతాపూర్ : శ్రీనివాసపురంలోని గోవిందా సమేత మద్విరాట్ పోతలూరి వీరబ్రహ్మేంద్ర స్వామివారి దేవాలయ ప్రాంగణంలో గురువారం ప్రధాన అర్చకులు శాంతనాచార్యులు ఆధ్వర్యంలో సనారీ విశ్వేశ్వరస్వామి, అన్నపూర్ణదేవీ కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. యదార్థ పీఠాధిపతి రాయప్రోలు జనార్ధనాచార్యులు స్వామివారి చరిత్ర గురించి వివరించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు బైరోజు రామస్వామి, ప్రధాన కార్యదర్శి యాలాల వెంకటేశచారి, వడ్ల ముత్యమాచారి, శశిధర్ శిల్పి పాల్గొన్నారు.

రూ.63 లక్షలతో బాక్స్‌డ్రైన్ పనులు



మచ్చ బొల్లారంలో బాక్స్‌డ్రైన్ పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ రాజ్‌జితేంద్రనాథ్

అల్వాల్: వర్షాకాలం వచ్చేలోగా ముంపు నివారణ చర్యలు చేపట్టాలని మచ్చ బొల్లారం డివిజన్ కార్పొరేటర్ రాజ్‌జితేంద్రనాథ్ అన్నారు. డివిజన్ పరిధిలోని కుటియా టెంపుల్ వద్ద రూ.63 లక్షలతో చేపట్టిన బాక్స్ డ్రైనేజీ పనులను ఆయన గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. డివిజన్‌ను ఆదర్శవంతంగా డివిజన్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని అధికారులు అభివృద్ధి పనులను సత్వరమే పూర్తి చేయాలన్నారు. బొబ్బిలి సురేందర్‌రెడ్డి, రూపేష్ జైన్, నాగేష్‌యాదవ్, సంజయ్, శ్రీశైలంయాదవ్, హరిబాబు, దినేష్‌పాల్, రవి, వెంకటేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

చదువును నిర్లక్ష్యం చేయొద్దు !



విద్యార్థులతో ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

మల్కాజిగిరి: పదోతరగతి పూర్తయిన తర్వాత ప్రతి విద్యార్థికి చదువు కీలకమని, చదువును నిర్లక్ష్యం చేయొద్దని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. గురువారం ప్రశాంత్‌నగర్ ప్రోబెల్స్ స్కూల్‌లో మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలో పదోతరగతిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను మాజీ కార్పొరేటర్ మురుగేష్ ఆధ్వర్యంలో సన్మానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి తల్లితండ్రుల కష్టాన్ని గుర్తించాలని, విద్యార్థులను చదివించేందుకు వారు ఎన్నో త్యాగాలు చేస్తారని త్యాగానికి గుర్తింపు రావాలంటే చదువుల్లో రాణించాలన్నారు. పదోతరగతి తర్వాత డిగ్రీ వరకు కీలకమని అశ్రద్ధ చేయకుండా చదువుకోవాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన ఎందరో విద్యార్థులు నేడు ప్రభుత్వ ఉద్యోగాల్లో కీలకంగా ఉన్నారన్నారు. మండల విద్యాధికారి సురేష్, ప్రధానోపాధ్యాయులు సరస్వతి, వెంకటరమణ, విజయకుమారి, కిరణ్మయి, దమయంతి, మల్లికార్జున్, వినూత్న, అంజయ్య, జేఏసీ వెంకన్న, రాముయాదవ్, ఉపేందర్ తదితరులున్నారు.

వైభవంగా నగరేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన



అల్వాల్‌లో విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవంలో విద్యాశంకర భారతి స్వామి

అల్వాల్ : పట్టణం మహిమాన్విత క్షేత్రంగా అభివృద్ధి చెందుతుందని పుష్పగిరి శంకరాచార్య పీఠాధిపతి విద్యా శంకర భారతి స్వామి అన్నారు. గురువారం అల్వాల్ సాయిసూర్యనగర్‌లో నూతనంగా నిర్మించిన వాసవి కన్యకాపరమేశ్వరి సమేత నగరేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన చేశారు. యాదాద్రి దేవాలయ ప్రధాన అర్చకులు, రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్‌పర్సన్ కాల్వ సుజాత, మాజీ టూరిజం కార్పొరేషన్ చైర్మన్, ఉప్పల శ్రీనివాస్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సమస్యలపై సమీక్ష

మల్లాపూర్: నాచారం డివిజన్‌లో తాగునీటి సరఫరా, డ్రైనేజీ వ్యవస్థపై గురువారం జలమండలి మేనేజర్ సిరాజుద్దీన్‌తో నాచారం కార్పొరేటర్ శాంతిసాయిజెన్‌శేఖర్ సమీక్ష నిర్వహించారు. టెండర్ లైన్ పనులు త్వరితగతిన ప్రారంభమయ్యేలా చూడాలని సూచించారు. అన్నపూర్ణ కాలనీలో డ్రైనేజీ, తాగునీటిపై ఇబ్బందులు పడుతున్నారని తక్షణమే సమస్యను పరిష్కరించాలని కార్పొరేటర్ ఆదేశించారు. నాచారం డివిజన్‌లో అవసరమైన భూగర్భ డ్రైనేజీ, తాగునీటి పైపులైన్స్‌పై ప్రతిపాదనలను చేశారు. సివరేజ్ సూపర్‌వైజర్ రాకేష్ తదితరులున్నారు.



జలమండలి మేనేజర్‌తో సమీక్ష నిర్వహిస్తున్న కార్పొరేటర్ శాంతి

వెంకన్నస్వామికి చందన సేవ

మల్కాజిగిరి: ఆనంద్‌బాగ్ లక్ష్మీవేంకటేశ్వరస్వామి దేవస్థానంలో వైశాఖ శుద్ధ ఏకాదశి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురువారం శతఘటాల పూజ అనంతరం స్వామివారికి అభిషేకం, అనంతరం చందనసేవ, పూర్ణకుంభాన్ని ఊరేగించి ఆలయ శిఖర సంప్రోక్షణ కార్యక్రమం ప్రధాన అర్చకులు ముడుంబై వేంకటరమణాచార్యులు, అర్చకులు తులసీరమణాచార్యులు నిర్వహించారు. ఈవో రవీందర్‌రెడ్డి, క్లర్క్ సుధాకర్, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



పూర్ణకుంభం, శత ఘటాల పూజలో పండితులు



చందన అలంకారంలో స్వామివారు

బస్‌షెల్టర్లు లేక ప్రయాణికుల అవస్థలు !



గౌతంనగర్: మల్కాజిగిరి సర్కిల్ పరిధిలోని ప్రాంతాల్లో ప్రధాన, అంతర్గత రోడ్లలో బస్‌షెల్టర్లు లేకపోవడంతో ప్రయాణికులు రోజూ ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే ప్రయాణికులు గంటల తరబడి ఎండ, వర్షానికి ఇబ్బంది పడుతున్నామని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఏళ్ల తరబడి సమస్య ఉన్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ముందుకొచ్చి బస్‌షెల్టర్ల ఏర్పాటుకు తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

గంజాయి విక్రయిస్తున్న ఇద్దరి రిమాండ్

పోచారం: నిషేధిత గంజాయి విక్రయిస్తున్న వ్యక్తులను ఘట్‌కేసర్ ఎక్సైజ్ స్టేషన్ పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. ఇన్‌స్పెక్టర్ జూపల్లి రాజు తెలిపిన ప్రకారం.. బోడుప్పల్ డంపింగ్‌యార్డు సమీపంలో తనిఖీలు నిర్వహిస్తుండగా.. ద్విచక్ర వాహనంపై ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించారు. వీరిని అదుపులోకి తీసుకుని తనిఖీ చేశారు. పోలీసుల తనిఖీల్లో 2.370 కేజీల గంజాయి బయటపడింది. నిందితులు మల్లాపూర్ ప్రాంతానికి చెందిన భాస్కర్‌రావు అలియాస్ బూటాన్ (25), బొంత సురేష్ అలియాస్ చిన్న (27)గా గుర్తించారు. ఒడిశాకు చెందిన బహేరమంతు నుంచి గంజాయిని వీరితో పాటు నల్ల దినకర్ కొనుగోలు చేసి బోడుప్పల్, చర్లపల్లి, మల్లాపూర్ ప్రాంతాల్లో విక్రయిస్తున్నట్లు తెలిసింది. నిందితుల వద్ద లభించిన గంజాయితో పాటు రెండు మొబైల్‌ఫోన్లు, ద్విచక్ర వాహనాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు నిందితులను కోర్టులో హాజరు పరచగా.. న్యాయమూర్తి రిమాండ్ విధించారు. మరో ఇద్దరు నిందితులు నల్ల దినకర్, బహేర పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.



పోలీసుల అదుపులో నిందితులు

నకిలీ డాక్యుమెంట్ కేసులో నిందితుడి రిమాండ్

ఘట్‌కేసర్: నకిలీ డాక్యుమెంట్లు సృష్టించిన కేసులో కోర్టుకు హాజరుకాకుండా కోర్టు ఆదేశాలను ధిక్కరించిన నిందితుడిని ఘట్‌కేసర్ పోలీసులు గురువారం రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ పరశురాం తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ నల్లకుంటకు చెందిన సురేందర్‌రెడ్డితో పాటు మరో నలుగులు కొర్రెముల్ సర్వేనంబర్ 740/ పార్ట్, 741/పార్ట్, 472/పార్ట్‌లో పలు ప్లాట్లు కొనుగోలు చేశారు. అదే సర్వేనంబర్లలోని 6296 చదరపు గజాలు భూమిని కట్కూరి ప్రభాకర్‌రెడ్డి అనే వ్యక్తి 2005లో కొనుగోలు చేసి వీరయ్య, సోమిరెడ్డికి విక్రయించాడు. ఇట్టి భూమి సురేందర్‌రెడ్డి భూమికి ఆనుకుని ఉంటుంది. అనంతరం నిందితుడు ప్రభాకర్‌రెడ్డి ఈ భూమిని మోసంతో తిరిగి ఇతరులకు విక్రయించాడని, బాధితుల ఫిర్యాదుతో 2011లో అతడిపై పోలీసులు కేసు నమోదు చేశారు. బెయిల్‌పై వచ్చిన తర్వాత సురేందర్‌రెడ్డికి సంబంధించి భూమిపత్రాలకు నకిలీ పత్రాలు సృష్టించాడు. అట్టి డాక్యుమెంట్స్ ప్రకారం భౌతికంగా వెళ్లగా.. సురేందర్‌రెడ్డి భూమిలో చూపుతుంది. డబుల్ రిజిస్టర్ డాక్యుమెంట్లతో కొనుగోలు చేసిన వ్యక్తులు సురేందర్‌రెడ్డికి చెందిన భూమిలోకి చొరబడి ఆక్రమించాలని సమస్యలు సృష్టిస్తున్నారు. ఈ విషయమై 2019లో కేసు నమోదైంది. అప్పటి నుంచి ప్రభాకర్‌రెడ్డి పరారీలో ఉండటంతో కోర్టు అతడిపై నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. దీంతో పోలీసులు అతడిని అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరు పరచగా రిమండ్ విధించింది.



కట్కూరి ప్రభాకర్‌రెడ్డి

మరో ఘటనలో నలుగురిపై కేసు

పోచారం: నకిలీ డాక్యుమెంట్లు సృష్టించిన నలుగురు వ్యక్తులపై పోచారం ఐటీ కారిడార్ పోలీస్‌స్టేషన్‌లో గురువారం కేసు నమోదైంది. ఇన్‌స్పెక్టర్ రాజు తెలిపిన ప్రకారం.. జీహెచ్ఎంసీ పరిధిలోని రామంతాపూర్ ప్రాంతానికి చెందిన వట్టిపల్లి లక్ష్మీనారాయణ, తన స్నేహితుడు మధుగౌడ్ కలిసి 2019లో బిక్క లింగమ్మ నుంచి కొర్రెముల్‌లోని సర్వేనెంబర్ 746లో 300 చదరపు గజాల విస్తీర్ణంతో ఉన్న ప్లాట్ నెంబర్ 133 కొనుగోలు చేశారు. ఇటీవల ఎన్‌కంబరెన్స్ సర్టిఫికెట్ (ఈసీ) తీసుకోగా.. ప్లాట్ నెంబర్ 133ని 2001లో సంగి మల్లేష్ నుంచి బండారి సత్యనారాయణ కొనుగోలు చేసినట్లు గుర్తించారు. సాక్షులుగా ప్రభాకర్‌రెడ్డి, ఎం.భాస్కర్‌రెడ్డి వ్యవహరించారు. నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి తన ప్లాటును ఆక్రమించే ప్రయత్నం చేస్తున్నారని లక్ష్మీనారాయణ కోర్టును ఆశ్రయించడంతో నలుగురు వ్యక్తులు సత్యనారాయణ, మల్లేష్, ప్రభాకర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

అడ్వాన్స్ తిరిగి చెల్లించని కేసులో..

పోచారం: ప్లాటు లావాదేవీల్లో అడ్వాన్స్ తిరిగి చెల్లించని వ్యక్తిపై పోచారం ఐటీ కారిడార్ పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ రాజు తెలిపిన ప్రకారం.. నారపల్లిలోని ఓయూ కాలనీకి చెందిన వెంకటేష్ 2023లో కె.ప్రభాకర్‌రెడ్డి వద్ద కొర్రెముల్‌లోని సర్వేనెంబర్ 746లో 200 చదరపు గజాల ప్లాటును రూ. 42 లక్షలకు కొనుగోలు చేసేందుకు ఒప్పందం చేసుకున్నారు. అడ్వాన్సుగా ప్రభాకర్‌రెడ్డికి రూ.5.75 లక్షలు వెంకటేష్ చెల్లించి అగ్రిమెంట్ రశీదు తీసుకున్నాడు. అనంతరం ప్లాటుకు సంబంధించిన ఈసీ తీసుకోగా అందులో తాను కొనుగోలు చేయాలనుకున్న ప్లాటు ఎ.చంద్రకాంత్ పేరుతో ఉన్నట్లు తెలిసింది. దీంతో ప్రభాకర్‌రెడ్డి మోసం చేస్తున్నట్లు గమనించాడు. తాను చెల్లించిన అడ్వాన్సు తిరిగి ఇవ్వమంటే ఇష్టమొచ్చినట్లు తిట్టి, బెదిరించాడని, ఎలాగైనా తనకు న్యాయం చేయాలని కోర్టును ఆశ్రయించడంతో ప్రభాకర్‌రెడ్డిపై పోలీసులు కేసు నమోదు చేశారు.